సాక్షి
రంగారెడ్డి

సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



అవిశ్వాసాల గుబులు!

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పురపాలక సంఘాల్లో అవిశ్వాసాల చిచ్చు జోరందుకుంది. 8లో▶



మానసిక ఒత్తిడి దూరం

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ అన్నారు. 8లో▶



టమాట.. లాభాల పంట

టమాట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధ్యమని ఉద్యాన శాఖ 'పట్నం' డివిజన్ అధికారి కనకలక్ష్మి అన్నారు. 8లో▶

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కేటీఆర్ పరామర్శ



చేవెళ్ల: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోదా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వేర్వేరుగా ఆదివారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడిన అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

శాస్త్రీయ అవగాహన పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఎల్ రిటైర్డ్ శాస్త్రవేత్త డా.రాజేశ్వర్ రావు

తుర్కయంజాల్: మన నిత్య జీవితంలో ప్రతి సమస్యకు పరిష్కారం శాస్త్ర విజ్ఞానం ద్వారానే లభిస్తుందని.. ప్రతి విద్యార్థి శాస్త్రీయ అవగాహన పెంచుకుని, శాస్త్రీయ దృక్పథంతో మెలగాలని డీఆర్‌డీఎల్ రిటైర్డ్ శాస్త్రవేత్త డా.రాజేశ్వర్ రావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్‌లోని లార్డ్స్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి, సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో జిల్లాలోని 30 పాఠశాలలకు చెందిన సుమారు 100 విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఇ.గాలయ్య, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు సాయిబాబా, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, కార్యదర్శులు రాములయ్య, సుధాకర్ రెడ్డి, కురుమయ్య, మహేశ్, భార్గవి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



ఓ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ప్రాంతీయ సమన్వయాధికారి శారద

మొయినాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్ ప్రవేశాల కోసం నిర్వహించిన సీఓఈ సెట్(ప్రవేశ పరీక్ష) ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,211 మంది విద్యార్థులకు గాను 4,026 మంది హాజరయ్యారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థులు పరీక్ష రాశారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద పలు కేంద్రాలను సందర్శించి పరీక్ష జరిగిన తీరును పరిశీలించారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మేలు

చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేసిన ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

చేవెళ్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊరెళ్ల సమీపంలో ఉన్న సాగర్ అగ్రి బిజినెస్ స్కూల్, సాగర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లో రెండురోజులుగా జరుగుతున్న ఖేల్ ఉత్సవ్–2024 క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల మానసికోల్లాసానికి ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. అన్ని కళాశాలల్లో విద్యార్థులకు చదువుతోపాటు ఇలాంటి పోటీలను తరచూ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ మహిపాల్‌రెడ్డి, ముస్తాక్ ఖాన్, రామ్ నరేశ్, గడిగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చారా సరి.. లేదంటే కిరికిరి!

చేయి తడిపితేనే ఫైలు కదిలేది

- పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్, పీఆర్ విభాగంలో అక్రమ వసూళ్లు
- ప్రతీ బిల్లుకు పర్సంటేజీ
- గగ్గోలు పెడుతున్న కాంట్రాక్టర్లు
- బిల్లుల కోసం ఆయా కార్యాలయాల చుట్టూ చక్కర్లు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాలు అక్రమార్కులకు నిలయంగా మారాయి. ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది చేయి తడపనిదే ఫైలు ముందుకు కదపడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులకు అంచనాలు రూపొందించడం మొదలు టెండర్ దాఖలు.. చేసిన పనులకు బిల్లులు చేయడం.. వాటి మంజూరు కోసం ఉన్నతాధికారులకు పంపడం.. తర్వాత ట్రెజరీల ద్వారా చెక్కులను మంజూరు చేయించడం వరకు ఇలా.. ప్రతి దశలోనూ ఎంతో కొంత పర్సంటేజీ చొప్పున సమర్పించుకోవాల్సి వస్తోంది. ఇచ్చేందుకు నిరాకరించిన కాంట్రాక్టర్లకు ఆయా విభాగాల అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. ఏళ్ల తరబడి బిల్లులను పెండింగ్‌లో పెట్టి ముప్పతిప్పలు పెడుతున్నారు.

నేతలకూ వాటా..

జిల్లాలో 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉన్నాయి. మరో 558 పంచాయతీలు ఉన్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు, వైకుంఠధామాలు, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు, కమ్యూనిటీ హాళ్లు, మున్సిపాలిటీ, పంచాయతీ భవనాలు, పార్కులు, వాటి చుట్టూ ప్రహరీల నిర్మాణం, మన ఊరు మనబడి పథకంలో భాగంగా చేపట్టే అదనపు తరగతి గదుల నిర్మాణాలు, వంట గదులు, డైనింగ్ హాళ్లు, పాఠశాల ప్రాంగణాల చుట్టూ ప్రహరీల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలోని ఏఈలు, డీఈలు వీటికి అంచనాలు రూపొందిస్తుంటారు. ఆయా పనులకు ఆన్‌లైన్‌లో టెండర్లు పిలుస్తుంటారు. అందరికంటే తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్లకు ఆయా పనులు అప్పగిస్తుంటారు. టెండర్ ద్వారా దక్కించుకున్న పనులు చేయాలంటే ముందు స్థానిక నేతలను ప్రసన్నం చేసుకోవాల్సి వస్తోంది. వారికి ముందే ఐదు నుంచి పది శాతం కమీషన్ చెల్లించాల్సి వస్తోంది. చేపట్టిన పనులను సంబంధిత ఇంజనీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. పనుల నాణ్యతను పరిశీలించి బిల్లులు మంజూరు చేయాల్సి ఉంది. ఇదే అవకాశంగా కొంతమంది అక్రమార్కులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్టు తెలుస్తోంది.

అవకాశాన్ని ఆదాయంగా..

చేపట్టిన పనుల్లో స్వరూపం మారినప్పుడు బిల్లు చెల్లించే అంశంలోనే కాదు రూ.5 లక్షలు దాటిన పనుల బిల్లు చెల్లింపునకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనుమతి తప్పనిసరి. ఇదే అదనుగా కాంట్రాక్టర్ల నుంచి ఒక్కో అధికారి తన స్థాయిని బట్టి చెల్లించే బిల్లులో రెండు నుంచి ఐదు శాతం పర్సంటేజీలు వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఎస్‌ఈ, ఈఈ, డీఈ, ఏఈలే కాదు ఆయా సెక్షన్లలో పని చేసే సిబ్బంది సైతం చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక్కో ఫైలుకు రూ.2000 వరకు వసూలు చేస్తున్నట్టు వినికిడి. గతంలో మీర్‌పేట్ మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగంలో ఏఈగా పని చేసి, విధులు సక్రమంగా నిర్వర్తించక పోవడంతో ఉమ్మడి జిల్లా ఈఈ ఆఫీసుకు బదిలీపై వెళ్లిన ఓ వ్యక్తి ఈ వసూళ్లలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈఈ అనుమతి కోసం వచ్చిన ఎంబీలను(మెజర్‌మెంట్స్ బుక్) నచ్చిన, పర్సంటేజీ ఎక్కువ ఇచ్చే కాంట్రాక్టర్లకు వేగంగా ఇస్తున్నారు. నిరాకరించిన వారికి వివిధ రకాల సాకులు చూపుతూ ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పుతున్నారు. చేసిన అప్పులు పెరిగి పోతుండటంతో చేసేది లేక చివరికి వారు ఎంతో కొంత సమర్పించుకోవాల్సి వస్తోంది. ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారుల తీరుతో కొత్తగా పనులు చేపట్టాలంటేనే కాంట్రాక్టర్లు జంకుతున్నారు.

ముట్టజెబితేనే 'ప్రొసీడింగ్'

మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా మంజూరు చేస్తుండగా, పంచాయతీల పరిధిలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చెల్లిస్తుంటారు. కాంట్రాక్టర్లు చేసిన పనులకు ఆయా విభాగాల ఇంజనీర్లు ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపు ప్రొసీడింగ్స్ తయారు చేసి, బడ్జెట్ రిలీజ్ కోసం కలెక్టరేట్‌కు పంపిస్తుంటారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల విభాగం)లోని హెచ్ సెక్షన్‌కు చెందిన ఓ ఉద్యోగి పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాల నుంచి వచ్చిన ప్రొసీడింగ్స్‌ను ఉన్నతాధికారి టేబుల్‌పైకి పంపడంలో తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పని చేసిన కాంట్రాక్టర్ లేదా మధ్యవర్తి స్వయంగా వచ్చి చేయి తడిపితే కానీ ఫైలు ముందుకు కదలడం లేదు. ఇచ్చేందుకు నిరాకరించిన వారి బిల్లులకు సంబంధించిన ఫైళ్లను రోజుల తరబడి తన వద్దే పెండింగ్‌లో పెట్టుకుని, వారికి సకాలంలో డబ్బులు రాకుండా అడ్డుకుంటున్నట్లు సమాచారం. ఫలితంగా అప్పులు చేసి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.



సభలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఉద్యమకారులకు అండగా ఉంటాం

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత సభ

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల లోక్‌సభ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత సభ నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ హాజరయ్యారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమకారులను గుర్తించి తగిన గౌరవం ఇస్తామని.. అందరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఉద్యమంలో పని చేసిన వారిలో చాలా మందికి గుర్తింపు లేదని.. ఎఫ్ఐఆర్‌లు లేవని.. అలాంటి వారిని కూడా గ్రామాల్లో గుర్తిస్తామన్నారు. ఉద్యమకారులను అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం వారినే అణచివేసిందని, గుర్తింపు లేకుండా చేసిందని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమ లక్ష్యాలను నీరుగార్చిందని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేసీఆర్ నియంతృత్వ ధోరణితో ఉద్యమకారులను అణచివేసి, ఉద్యమ ద్రోహులను చేరదీశారని విమర్శించారు. తెలంగాణ ప్రజలపై ఎలాంటి ప్రేమ లేదని, తన కుటుంబాన్ని, తన సంపదను పెంచుకునేందుకు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు నిజమైన తెలంగాణ వచ్చిందని అన్నారు. ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండ రామ్‌కు ఎమ్మెల్సీ పదవి రాకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులందరినీ గుర్తించి తగిన న్యాయం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీనే ఉద్యమకారులను గుర్తించి, వారికి సరైన న్యాయం చేస్తోందన్నారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు యాదిరెడ్డి, శ్యామల, పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, డీసీసీ నాయకులు యాలల మహేశ్వర్‌రెడ్డి, ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డీవీఆర్, ఉద్యమకారుల ఫోరం జిల్లా, నియోజకవర్గాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

పార్టీ నిర్ణయానికి కట్టుబడాల్సిందే..

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి హెచ్చరించారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధి మంగళ్‌పల్లి సమీపంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడం సరికాదన్నారు. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించిన కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డిని ఇప్పటికే సస్పెండ్ చేసినట్టు తెలిపారు. పార్టీ కౌన్సిలర్లందరికీ విప్ జారీ చేశామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గేందుకు శ్రేణులు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు కట్టుబడి ఉండాలన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో చైర్మన్‌పై ఇతర పార్టీ కౌన్సిలర్ల మద్దతుతో అవిశ్వాసం పెట్టారని, పార్టీ కౌన్సిలర్లు మద్దతు ఇవ్వొద్దని సూచించారు. పార్టీ సూచించిన వారికే మద్దతివ్వాలన్నారు. విప్ ధిక్కరించి పార్టీకి వ్యతిరేకంగా ఎవరు ఓటు వేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తుర్కయంజాల్, పెద్దంబర్‌పేట్ మున్సిపాలిటీల్లోనూ చైర్మన్, వైస్ చైర్మన్లపై కలెక్టర్‌కు నోటీసులిచ్చారని వారికి కూడా ఫోన్లు చేసి మాట్లాడినట్లు తెలిపారు. ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే పీసీసీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, ధన్‌రాజ్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు కొత్త యాదగిరిగౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మన్నెగూడ వద్ద ఉన్న వేద ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మడుపు వేణుగోపాల్‌రావు తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి సమావేశానికి హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అన్యాయాన్ని సహించేది లేదు

బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్



విలేకరులతో మాట్లాడుతున్న మహేందర్

ఆమనగల్లు: బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు డా.బొల్లు మహేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.2 వేల కోట్లు కేటాయించారని విమర్శించారు. బీసీలకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలపై బీసీలు చైతన్యవంతం కావాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 60 శాతం ఉన్న బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో 1 శాతం నిధులు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాజకీయ పార్టీలు ఓట్ల కోసమే వాడుకుంటూ మోసం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు అండగా ఉండే పార్టీలకు మద్దతుగా ఉండాలని సూచించారు. కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఈనెల 5,6 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెద్ద ఎత్తున బీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యువతలో వ్యక్తిత్వాన్ని వికసింపజేయాలి



చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: యువత ఒత్తిడిని తట్టుకునే విధంగా వారిలో వ్యక్తిత్వాన్ని వికసింపజేస్తే ఆత్మహత్యలు ఆగుతాయని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ సూచించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న సనాతన ధార్మిక సదస్సులో ఆదివారం పాల్గొన్న ఆయన మాట్లాడుతూ టీటీడీకి పలు సూచనలు చేశారు. కళాశాలల్లో వారానికి ఒకటి, రెండు గంటలు వ్యక్తిత్వాన్ని వికసింపచేసే విధంగా టీటీడీ కళాశాలల యాజమాన్యాలను భాగస్వాములను చేయాలన్నారు. యువతరానికి మన సనాతన ధర్మబాంధవ్యాలు, ఆచరణలు, అంతరార్థాలు తెలిసే విధంగా టీటీడీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమాజంలో అన్ని వర్గాలు, అన్ని జాతులు సమానమని చాటి చెప్పిన మునివాహన సేవ వృత్తాంతాన్ని 2018లో స్వయంగా తాను చేపట్టానన్నారు. వివాహ ప్రక్రియలో ప్రాచీన పద్ధతులు కనుమరుగవుతున్నాయని.. పెళ్లిళ్లు చేసే పురోహితులతో సమావేశం నిర్వహించి వివాహ ప్రక్రియలో ముఖ్యమైన ఘట్టాలను, పద్ధతులను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేయాలన్నారు. తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లో భక్తులు వేచి ఉండే సమయంలో భజన బృందాలతో భజనలు చేయించాలన్నారు. బుర్రకథ, ఒగ్గుకథ, యక్షగానం వంటి ప్రాచీన కళలను పునరుద్ధరించే ప్రయత్నం చేయాలని సూచించారు.

స్నేహితులతో వెళ్లాడు.. కారులో శవమయ్యాడు..



రమేశ్ (ఫైల్)

మణికొండ: ఇద్దరు మిత్రులతో కలిసి కారులో యాదగిరిగుట్టకు బయలుదేరిన ఓ వ్యక్తి మరుసటి రోజు ఉదయం తన కారులోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం నగరంలోని మణికొండలో కలకలం సృష్టించింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ జి. హరికృష్ణారెడ్డి కథనం ప్రకారం... మణికొండకు చెందిన బుద్దోలు రమేశ్(40) ఆటో డ్రైవర్. ఇటీవల అతడు కారును కొనుగోలు చేశాడు. మిత్రులు వెంకటేష్, శ్రీకాంత్‌రెడ్డిలతో కలిసి శనివారం ఉదయం కారులో యాదగిరి గుట్టకు బయలుదేరారు. తిరిగి వస్తున్న క్రమంలో పుప్పాలగూడ గోల్డెన్ టెంపుల్ సమీపంలో పెట్రోల్ అయిపోవడంతో కారు ఆగిపోయింది. దీంతో మిత్రులిద్దరూ తమ ఇళ్లకు వెళ్లిపోయారు. రమేశ్ మాత్రం కారులోనే ఉండిపోయాడు. ఉదయం మున్సిపల్ సిబ్బంది గమనించి కారులో ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడని పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన పోలీసులు కారు నంబర్ ఆధారంగా మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రమేశ్ మృతిపై తమకు అనుమానం ఉందని విచారణ జరపాలని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

6, 9, 12వ తేదీల్లో ఉచిత దంత వైద్య శిబిరాలు

బంజారాహిల్స్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) డెక్కన్ బ్రాంచ్, ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ (ఏఐఐఈ) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 9, 12 తేదీల్లో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని ఆరోగ్య కేంద్రంలో ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. వివరాలకు 99591 54371, 99639 80259 నంబర్లలో సంప్రదించాలి.

ఉచిత వెలుగులు


గృహజ్యోతికి కేబినెట్ ఆమోదం

- గ్రేటర్‌లో 19.85 లక్షల మందికి ప్రయోజనం
- 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వినియోగదారులకే..
- ప్రభుత్వంపై నెలకు రూ.210 కోట్లకుపైగా భారం
- త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేయనున్న ప్రభుత్వం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గృహజ్యోతి పథకానికి రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఆదివారం సీఎం రేవంత్ నేతృత్వంలోని మంత్రి మండలి సమావేశమైంది. ఆరు గ్యారంటీల పథకం అమల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అంగీకరించింది. ఈ పథకంలో భాగంగా నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయనుంది. మూడు జిల్లాల పరిధిలో మొత్తం 50.99 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ఉచిత విద్యుత్‌కు 19.85 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 100 యూనిట్లలోపు 12 లక్షల మంది వినియోగిస్తుండగా, మిగిలిన వారు 200 యూనిట్ల లోపు వాడుతున్నారు. వీరికి ఉచిత విద్యుత్ ఇవ్వాలంటే నెలకు రూ.210 కోట్ల మేరకు వ్యయం అవుతుంది.

జిల్లాల వారీగా ఇలా..

జీహెచ్ఎంసీ పరిధిలో 18.95 లక్షల మంది దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, వీరిలో 14.04 లక్షల మంది గృహ విద్యుత్ వినియోగదారులు నెలకు సగటున 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. కేబినెట్ ఆమోదంతో వీరందరికీ నెలవారి విద్యుత్ బిల్లుల నుంచి ఊరట లభించనుంది. అదే విధంగా రంగారెడ్డి జిల్లాలో 5.10 లక్షల దఖాస్తుల్లో 3.99 లక్షల దరఖాస్తులు ఉచిత విద్యుత్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇక మేడ్చల్ జిల్లాలో 2.27 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 1.81 లక్షల మంది వినియోగదారులు 200 యూనిట్ల లోపు విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.



మహిళ అదృశ్యం



మైమూనా బేగం (ఫైల్)

పహాడీషరీఫ్: మహిళ అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ గ్రామానికి చెందిన మైమూనా బేగం (55) భర్త మూడేళ్ల క్రితం గుండె పోటుతో మృతి చెందడంతో పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది. రెండు నెలల క్రితం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. మహ్మద్ తెర్బాజ్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ మైమూనా కుమారుడు సొహేల్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

అనుమానాస్పదంగా పంచాయతీ కార్మికుడి మృతి



బాల కృష్ణయ్య మృతదేహం

షాబాద్: అపస్మారక స్థితిలోకి వెళ్లిన గ్రామ పంచాయతీ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోడంపాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోడంపాడు గ్రామానికి చెందిన బాలకృష్ణయ్య(53) గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం సర్దార్‌నగర్‌లో బ్యాంక్ పని ఉందని గ్రామానికి చెందిన కొత్పల్లి నర్సింలుతో కలిసి వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని వచ్చే దారిలో మద్యం తాగి సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఇంట్లోనే విశ్రాంతి తీసుకున్నాడు. సాయంత్రం అతని కుమారుడు శివ చూడగా పడుకున్న చోటనే వాంతులు చేసుకొని అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవిశ్వాసాల గుబులు

- రసవత్తరంగా పురపాలికల రాజకీయాలు
- ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల చైర్ పర్సన్లకు పదవీగండం
- పావులు కదుపుతున్న అధికార, ప్రతిపక్ష నేతలు
- జిల్లాలో చర్చనీయాంశంగా మారిన వైనం



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం



ఆర్తికగౌడ్, ఆదిబట్ల మున్సిపల్ చైర్ పర్సన్



స్రవంతి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలోని పురపాలక సంఘాల్లో అవిశ్వాసాల చిచ్చు జోరందుకుంది. గత నెలలో ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపల్ చైర్ పర్సన్లపై, గత ఏడాది పెద్ద అంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని జిల్లా కలెక్టర్లకు అభ్యర్థనలను కౌన్సిలర్లు అందజేశారు. అధికార పార్టీకి చెందిన వారే చైర్ పర్సన్లుగా ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానానికి ఈ వ్యవహారం సంకటంగా మారింది. కాంగ్రెస్ చైర్మన్లపై అవిశ్వాసాలకు వెళ్లితే.. పార్టీ క్రమశిక్షణ చర్యలు చేపడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి బహిరంగంగా హెచ్చరించినా కౌన్సిలర్లు తగ్గేదేలేదంటున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గం రాజకీయాలు జిల్లాలోనే హాట్ టాపిక్‌గా మారాయి.

అదనుగా భావించి నోటీసులు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీల చైర్ పర్సన్లపై అవిశ్వాస పరీక్షకు ముహూర్తం ఖరారు కావడంతో రసవత్తరంగా రాజకీయాలు మారుతున్నాయి. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల చైర్ పర్సన్లు కప్పరి స్రవంతి, కొత్త ఆర్తికగౌడ్‌లు అధికార కాంగ్రెస్ పార్టీలో ఉండటంతో ఒక్కసారిగా పుర రాజకీయాలు వేడెక్కాయి. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికైన స్రవంతి అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అండతో చైర్ పర్సన్ పదవిని దక్కించుకుంది. కిషన్‌రెడ్డి, కప్పరి స్రవంతిల మధ్య వైషమ్యాలు తలెత్తడంతో ఏడాది క్రితమే దూరం పెరిగింది. అప్పటికే ఆమెపై అలకబూనిన కౌన్సిలర్లు ఇదే అదనుగా భావించి మూడేళ్ల కాలపరిమితి ముగిసిన వెంటనే గత సంవత్సరం అవిశ్వాస నోటీసులు కలెక్టర్‌కు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పురపాలక సంఘాలల్లో ఇదే తంతూ కొనసాగింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు ముగియడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రాజకీయాలు ఒక్కసారిగా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి అవిశ్వాసల ప్రక్రియ సాగుతోంది.

మారిన రాజకీయ పరిస్థితులు

ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రాజకీయ పరిస్థితులు మారాయి. రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ రావడంతో ఆమెకు కొంత బలం చేకూరింది. అప్పట్లో కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచిన కొత్త ఆర్తికగౌడ్ అధికార బీఆర్‌ఎస్‌లో చేరి ఆదిబట్ల మున్సిపల్ చైర్ పర్సన్ పదవిని దక్కించున్న విషయం విదితమే. ఈ పదవిని ఆశించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, కాంగ్రెస్ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డికి అప్పట్లో నిరాశే మిగిలింది. అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో ఏర్పడిన విభేదాల కారణంగా ఆర్తికగౌడ్ తిరిగి కాంగ్రెస్ గూటికి చేరింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ మర్రి నిరంజన్‌రెడ్డి తిరిగి మున్సిపల్ చైర్మన్ పదవిపై కన్నేశారు. తన రాజకీయ చతురతతో నిరంజన్‌రెడ్డి పావులు కదిపి బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల కౌన్సిలర్లను తనవైపు తిప్పుకున్నాడు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని 15 మంది కౌన్సిలర్లలో 12 మంది గత నెల 5న చైర్‌పర్సన్ కొత్త ఆర్తికగౌడ్, వైస్ చైర్మన్ కోరే కళమ్మలపై అవిశ్వాసం పెట్టేలని నోటీసులను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. మరోవైపు అధికారపార్టీలో కొనసాగుతున్న పెద్ద అంబర్‌పేట చైర్ పర్సన్ చెవుల స్వప్నపై గతేడాది అవిశ్వాసం పెట్టాలని నోటీసులు ఇచ్చిన కౌన్సిలర్లు ప్రస్తుతం స్తబ్దుగానే ఉన్నారు.

అవిశ్వాస నోటీసులు

ఇబ్రహీంపట్నం పురపాలక సంఘ పరిధిలో చైర్ పర్సన్‌తో కలిసి 24 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో 17 మంది అవిశ్వాస నోటీసులను గత నెల 8న కలెక్టర్‌కు అందజేశారు. ఇద్దరు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్ నుంచి ఎన్నికైన కౌన్సిలర్లతోపాటు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అందులో ఉన్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కొంద్రు శ్రీలత చైర్ పర్సన్ పదవి ఆశిస్తూ వ్యూహాలకు పదును పెడుతున్నారు.

క్యాంపుల్లోనే కౌన్సిలర్లు

ఆదిబట్ల పురపాలక సంఘంలో ఈ నెల 9న, ఇబ్రహీంపట్నం పురపాలక సంఘంలో ఈనెల 16న అవిశ్వాస పరీక్ష పెట్టేందుకు జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాలు జారీ చేశారు. అవిశ్వాసాలు వీగిపోయేందుకు ప్రస్తుత చైర్ పర్సన్‌ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ప్రత్యర్థులకు చిక్కకుండా కౌన్సిలర్లను క్యాంపులకు చైర్మన్ పదవులు ఆశిస్తున్న వారు తరలించారు.

మర్రి నిరంజన్‌రెడ్డిని సస్పెండ్

అవిశ్వాసాలను అధికార కాంగ్రెస్ చైర్మన్లు ఇందులో నుంచి గట్టేందుకు అన్నిరకాల వ్యూహారచనలతో ముందుకెళుతున్నారు. ఇందులో భాగంగా ఆదిబట్ల చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్న మర్రి నిరంజన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడుతున్నాడని క్రమశిక్షణ సంఘం చైర్మన్ డా చిన్నారెడ్డి సస్పెండ్ వేటు వేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్లందరిపై కూడా పార్టీ క్రమశిక్షణ సంఘం చర్యలు తీసుకొనున్నట్లు తెలుస్తోంది.

టమాట.. లాభాల పంట

- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి
- ఉద్యానశాఖ అధికారి కనకలక్ష్మి





గునుగల్‌లో సాగువుతున్న టమాట పంట

యాచారం: టమాట సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధ్యమవుతుందని, ధర కలిసోస్తే రైతులు స్వల్ప కాలంలోనే లాభాలు ఆర్జించవచ్చని ఉద్యాన శాఖ ఇబ్రహీంపట్నం డివిజన్ అధికారి కనకలక్ష్మి అంటున్నారు. నీరు ఉంటే వేసవి కాలంలో సైతం టమాట పంట మంచి దిగుబడి వస్తుందని ఆమె పేర్కొంటున్నారు. సాగులో పాటించాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

సాగు విధానం

బాగా మాగిన పశువుల ఎరువును నారుమడిలో వేసి కలిసి, 6 అంగుళాల ఎత్తైన నారు మళ్లు తయారు చేయాలి. కుళ్ల తెగుళు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా 0.5 శాతం బోర్డో మిశ్రమం గాని, సీఓసీ 3 గ్రాములు, లేదా డైథేయన్ జెడ్-78 లేదా డైథేన్-45ను రెండు, మూడు గ్రాములు లీటరు నీటిలో వేసి నారు మడిని తడపాలి.

విత్తనశుద్ధి

విత్తనం నుంచి సంక్రమించే తెగుళ్లను అరికట్టుటకు విత్తడానికి ముందు 2-3 గ్రాముల థైరమ్‌ను కిలో విత్తనాలలో కలిపి శుద్ధి చేయాలి.

నాటుట

దాదాపు 25-30 రోజుల వయసు గల నారు 60 సెం.మీ ఎడం ఉండునట్లుగా నాటాలి. ఎకరాకు 8 వేల మొక్కలు నాటాలి. వేసవిలో రకాన్ని బట్టి 60-45 సెం.మీ ఎడంలో అధిక సాంద్రతలో నాటాలి.

ఎరువులు

ఆఖరి దుక్కిలో హెక్టారుకు దాదాపు 20-25 టన్నుల పశువుల ఎరువును వేసి బాగా కలియదున్నాలి. 60 కిలోల పొటాష్, 60 కిలోల భాస్వరంను మొక్కలు నాటేటప్పుడు వేయాలి. వెయ్యి కిలోల నత్రజనిని మూడు సమపాళ్లుగా చేసి నాటిన 30వ రోజు, 45వ, 60వ రోజున వేయాలి.

అంతర కృషి

ఎప్పటికప్పుడు కలుపు మొక్కలను తీసి వేయాలి. రసాయనిక ఎరువులు వేసినప్పుడు నేలలో కలియబెట్టి మొక్కకు మట్టిని ఎగదోయాలి. ప్రతి మొక్కకు కర్రలను పాతి ఊతమిచ్చుట వలన మంచి పరిమాణం గల కాయలు ఏర్పడటంతో పాటు అవి నేలకు తగిలి కుళ్లు రాకుండా కాపాడవచ్చు. నవీన్, అవినాష్-2 మొదలైన హైబ్రిడ్ రకాలకు వరుసల వెంట దూరంలో బలమైన కర్రలను పాతాలి. మొక్క ఎదిగేకొద్ది అడ్డంగా వెదురు కర్రలను 9-12 అంగుళాల ఎత్తుకు ఒక వరుస చొప్పున కట్టి ఆధారం కలిపించాలి. పూత పిందె సమయంలో 15 లేదా 20 మి. గ్రాముల పారాక్లోరోఫినాక్సి అసిటాకామ్లం లేదా 2 మి.గ్రాములు 2,4-డి లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడంతో పూత, పిందె బాగా నిలిచి కాపు పెరుగుతుంది.

నీరు కట్టుట

భూమిలో తేమను బట్టి 7 నుంచి 10 రోజుల వ్యవధిలో నీరు కట్టాలి. వేసవిలో ప్రతి 5-6 రోజులకోమారు తడి అవసరం ఉంటుంది. డ్రిప్ పద్ధతి ఏర్పాటులో తగినంత తేమ ఉండడం వల్ల పెరుగుదల దిగుబడితో పాటు నాణ్యమైన పంట లభిస్తుంది. టమాటకు డ్రిప్ ఏర్పాటు చేసుకుంటే ఇతర కూరగాయల పంటలకు కూడా ఉపయోగపడుతుంది.

ముందుగా సమాచారం ఇస్తే

టమాట నారు కావాల్సిన రైతులు ముందే సమాచారం ఇవ్వాలి. అలా ఇస్తే ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై అందజేస్తాం. ప్రస్తుతం అయితే నారు ఇచ్చే అవకాశం లేదు. రైతులు అడిగితే మాత్రం జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని నార్లు పోసి కావాల్సిన వాళ్లకు అందజేస్తాం. నీటి సమస్య దృష్ట్యా స్వల్పకాలంలో వచ్చే టమాట పంట సాగు చేస్తే రైతులు లాభాలు పొందే అవకాశం ఉంది.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

షాబాద్: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఉరేసుకొని అనుమానాస్పదస్థితిలో ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాందర్‌ఖాన్‌పేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బర్ల నీలమ్మ(40) భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి ఉన్నారు. కొంత కాలంగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుకొని రాజీ అయ్యారు. అయినా కూడా కలహాలు కొనసాగుతునే ఉన్నాయి. దీంతో నీలమ్మ శనివారం ఇంట్లో ఉరి వేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతురాలి సోదరి శోభ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యంపై కేసు నమోదు



షేక్ కాసీం (ఫైల్)

పహాడీషరీఫ్: భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. దేవేందర్ నగర్ కాలనీకి చెందిన షేక్ షరీఫా, షేక్ కాసీం (45) దంపతులు. వీరిద్దరికీ రెండో వివాహమే జరిగింది. కాగా మూడు నెలల క్రితం భార్యభర్తలు గొడవ పడడంతో అతడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రెండు నెలల క్రితం షరీఫా తండ్రికి ఫోన్ చేసిన కాసీం 15 రోజుల్లో డబ్బులతో వస్తానని చెప్పాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాప్ చేశాడు. మొదటి భార్య వద్దకు వెళ్లి ఉంటాడని భావించినప్పటికీ, అక్కడ కూడా వెళ్లలేదన్న విషయం తెలుసుకున్న షరీఫా పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కేసు నమోదు చేసుకున్న పోలీసులు తెలిపారు.

నిర్లక్ష్యానికి భారీ మూల్యం

- మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు
- ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్

కడ్తాల్: రోడ్డు భద్రతా నియమాలు పాటించకుండా, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని సమీపంలోని టోల్‌ప్లాజ్ వద్ద ట్రాఫిక్ పోలీసు సిబ్బందితో కలిసి ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 10 మందిపై ర్యాష్ డ్రైవింగ్ కేసులు, 81 మందిపై హెల్మెట్ లేని కేసులు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 21 మందిపై కేసులు, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపిన ఐదుగురిపై, మైనర్ డ్రైవింగ్ 3 కేసులు కలిపి మొత్తం 145 కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ తెలిపారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

రాంగ్ సైడ్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారితో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారికి ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్ కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు నడిపే వ్యక్తి కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సీట్‌బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే శిక్ష తప్పదని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహన యాజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వరప్రసాద్, ఏఎస్‌ఐ ప్రసాద్‌జీ, ట్రాఫిక్ పోలీస్ పోలీస్ సిబ్బంది పూలేందర్, రామస్వామి, సంతోష్, రవికాంత్, రవీందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీరామ్, నరేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు సంజీవరెడ్డి, కార్యదర్శి గౌతమ్

ఇబ్రహీంపట్నం: క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని, పనిఒత్తిడి తగ్గి ఉపశమనం పొందుతారని రాష్ట్ర రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రెవెన్యూ స్పోర్ట్స్ మీట్‌ను మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ గ్రామ సమీపంలోని ఎస్ఎస్‌జీ క్రికెట్ మైదానంలో ఆదివారం నిర్వహించారు. వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల నుంచి రెవెన్యూ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. క్రికెట్‌లో విజేతగా నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టు కెప్టెన్ రామకృష్ణ బృందానికి ట్రోఫీని, మేడ్చల్ జిల్లా కెప్టెన్ సంతోష్ బృందానికి రన్నరప్ ట్రోఫీని అందజేశారు. బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, చెస్, క్యారమ్స్, ఖోఖో, మ్యూజికల్ చైర్ తదితర క్రీడాంశాల్లో విజేతలైన రెవెన్యూ ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంరెడ్డి, కె.నిరంజన్, ఎండీ అన్వర్, జాయింట్ సెక్రటరీ విజయేందర్, జిల్లా సెక్రెటరీ రామకృష్ణ, సభ్యులు ప్రసన్నలక్ష్మి, నాగజ్యోతి, కిరణ్, రాజేశ్వర్‌రెడ్డి, తారక్, సాగర్, సాయికిరణ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

అది నకిలీ కమిటీ

తెలంగాణ హిందీ ప్రచార సభ

హిమాయత్‌నగర్: తెలంగాణ హిందీ ప్రచార సభ నూతన కార్యవర్గం నకిలీదని వారి ప్రకటనలు అవాస్తవమని అధికారిక హిందీ ప్రచార సభ కార్యవర్గం ఖండించింది. కేవలం ఇద్దరు సభ్యులతో ఏర్పడిన నకిలీ హిందీ ప్రచార సభ పేరుతో ప్రచారం చేసుకోవడాన్ని ఖండించారు. ఈ మేరకు బషీర్‌బాగ్‌లో తెలంగాణ రాష్ట్ర హిందీ ప్రచార సభ ఆదివారం అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన హిందీ ప్రచార సభ ఆస్తులను కొల్లగొట్టడానికి కుట్రలు పన్నుతున్నా గుర్తింపు లేని సెంట్రల్ హిందీ ప్రచార సభకు చెందిన గైబువలి పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని వారిని కఠినంగా శిక్షించాలని అధికారిక కమిటీ ప్రతినిధుల డిమాండ్ చేశారు. రాష్ట్ర హిందీ ప్రచార సభ అధ్యక్షుడు జి.గాంధీ మాట్లాడుతూ.. నూతన కమిటీ చెల్లదని ప్రభుత్వం దర్యాప్తు జరిపించి నిజమైన కమిటీతో కలసి తెలంగాణ రాష్ట్ర హిందీ ప్రచార సభకు చెందిన ఆస్తులను పరిరక్షించాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సర్దార్ పాషా, కార్యదర్శి డాక్టర్ సాదిఖ్ పాషా, కోశాధికారి రామ్మోహనాచార్యులు, సురేందర్, పరీక్ష సంచాలకులు మల్లారెడ్డి, సభ్యులు జకీర్ పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హిందీ ప్రచార సభ కమిటీ అధ్యక్షుడు గాంధీ